## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఫైర్ స్టేషన్, విక్టరీ ప్లే గ్రౌండ్స్ పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, బడేమియా పెట్రోల్ పంప్, సీబీఎస్, వీవీ కన్యా పాఠశాల, సాయి గంగా లాడ్జ్, పుత్లీబౌలి, సంజయ్‌నగర్, నందిని హోటల్, గోల్‌బంగ్లా, గౌలిగూడ, టెలిఫోన్ ఎక్సైంజ్, రామ్ మందీర్, పాత బస్టాండ్ లైన్, దర్గా పీటీ, పూజలబస్తీ, పత్తర్ మజీద్, పూల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 11 కేవీ సీబీఐ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గుజరాతి గల్లీ, మిథిలా కాంప్లెక్స్, ట్రూప్ బజార్, వైశ్యా బ్యాంక్, సాగర్ ప్లాజా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### 13న రక్తదాన శిబిరం

గోల్కొండ: ఈనెల 13న రక్తదానం నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తెలిపారు. శనివారం గుడిమల్కాపూర్ బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ స్మృతిలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ రక్తదాన శిబిరం ఉంటుందని వారు తెలిపారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రక్తదాన శిబిరానికి ఎక్కువ సంఖ్యలో వచ్చి రక్తదానం చేయాలని వారు కోరారు.

### బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్, ఉమామహేంద్ర

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గం ప్రజా గోస బీజేపీ భరోసా శక్తి కేంద్ర ఇన్‌చార్జి కార్నర్ మీటింగ్‌ను శనివారం సుల్తాన్‌షాహీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న 180, 181 బూత్‌లలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, టి. ఉమామహేంద్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేంద్ర మాట్లాడుతూ.. బీజేపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా బూత్ స్థాయి నుంచి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేందర్, ప్రవీణ్ బాగ్డీ, కిషన్ లాల్, పవన్ మిశ్రా, నిత్యా పారిక్, కునాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

### గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో పెరిగిన ఔట్ పేషెంట్లు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. సీజనల్ వ్యాధులతో బాధపడే వారు ఉదయం 8 గంటల నుంచే ఓపీ విభాగం వద్ద బారులుతీరుతున్నారు. దగ్గు, జ్వరంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అందువల్లే రికార్డు సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్త ఎస్‌బీ గౌరీ

గౌలిపురా: వివేకానందనగర్‌లోని శివ నాగలింగేశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం శివ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త ఎస్‌బీ గౌరీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి ప్రమోద్ మహరాజ్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాస్య, శ్రీయాన్స్, నాగరాజు పాల్గొన్నారు.

### వితరణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మెరీడియన్ స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు ఇటీవల టర్కీ భూకంపంలో బాధితులకు సహాయంగా నిలవాలని తలపెట్టారు. శనివారం విద్యార్థులంతా తమ దుస్తులు, బ్లాంకెట్లు, ఆహార పదార్థాలను సేకరించారు. ఈ సామగ్రిని టర్కీ కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో అందజేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమం పట్ల స్పందించారు.

# నేటి నుంచి చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయం
- ఏర్పాట్లను పూర్తిచేసిన ఆలయ అధికారులు



చెన్నకేశవ స్వామి ఆలయం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని చారిత్రాత్మకమైన స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యింది. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాదాయ శాఖ తరఫున ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు, తెల్ల సున్నం వేయించిన అధికారులు రంగురంగుల విద్యుద్దీపాలను అమరుస్తున్నారు. విశాలమైన విస్తీర్ణంలో గుట్టపై వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం వందల ఏళ్లుగా భక్తుల సందడితో కళకళలాడుతూ వస్తుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

**'చెన్న రాయుని గుట్ట'నుంచి.. 'చాంద్రాయణ గుట్ట'గా..**

విశాలమైన గుట్టపై చెన్నకేశవ స్వామి స్వయంభూగా వెలువడంతో మొదట చెన్నరాయుని గుట్టగా పిలిచేవారు. కాల క్రమేణా చాంద్రాయణ గుట్టగా మారింది. కేశవ స్వామి పేరు మీద ఉండడంతో కేశవగిరి అని కూడా సంబోదిస్తారు. ఈ గుట్టపైనే శ్రీ మహాశివాలయం, శ్రీ చెన్న మల్లికార్జున భ్రమరాంబ ఆలయాలు కూడా కొలువుదీరాయి. ఇక్కడి భ్రమరాంబ దేవి గుహ లోపల ఉండడం విశేషం. చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆండాళమ్మ ఆలయం, శ్రీ చతుర్భుజ ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. కల్యాణ మండపం వద్ద ఉన్న వృక్ష గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఉత్సవాల సమయంలో గుట్టకు కిలో మీటర్ దూరంలో ఉన్న శ్వేతగంగ నీటిని తెచ్చి పూజలకు వినియోగించేవారు. ఈ గుట్టపై ఉన్న ఆలయాల ప్రస్తావన లింగ పురాణం, కేశవ పురాణం తదితర గ్రంథాలలో ఉండడం విశేషం.

**వైభవంగా నిర్వహిస్తాం..**



ఈనెల 12న బాలభోగంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13న రాత్రి స్వామివారు, అమ్మవార్ల ఎదుర్కోలు కార్యక్రమం ఉంటుంది. 14న మధ్యాహ్నం 12 గంటలకు తిరు కల్యాణోత్సవానికి రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు హాజరుకానున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వార్ల ఊరేగింపు ఉంటుంది. 15న పారాయణం, 16న మహా పూర్ణాహుతి, దేవోద్వాసన, ధ్వజ అవరోహణ కార్యక్రమాలుంటాయి. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– జుర్కి సంతోషి రాణి, ఆలయ కమిటీ చైర్మన్

### ఎంజే మార్కెట్ రోడ్డులో ఉద్రిక్తత



కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

అబిడ్స్: ఎంజేమార్కెట్ నుంచి అసెంబ్లీ వరకు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఎంజేమార్కెట్, గాంధీభవన్, పబ్లిక్‌గార్డెన్ వద్ద కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన జరుపుతుండడంతో సాయికుమార్‌తో పాటు పలువురు నేతలను అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసు బందోబస్తును తప్పించుకుని అసెంబ్లీవైపు పరిగెత్తుతున్న కాంగ్రెస్ నేతలు, సాయికుమార్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తరలించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..మత్స్యకారులందరికీ రూ.10 లక్షల ప్రీమియంతో హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులంతా ఏకమై కేసీఆర్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు.

### మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వెయ్యి మందితో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రే, శ్రీనివాస్, శైలేష్ కుమారతో పాటు పలువురు నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో ముజీబ్ హుస్సేని పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కూడా సమాజ సేవా కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

## 'ప్రసాద్‌పై పీడీ యాక్ట్, దేశద్రోహం కేసులు పెట్టాలి'



మాట్లాడుతున్న మూల రామ్ చరణ్ దాస్



ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బుంగ శివకుమార్

చార్మినార్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసాద్‌పై పీడీ యాక్ట్, దేశద్రోహం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం బీఎస్పీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడు చిరంజీవి, సికింద్రాబాద్ అధ్యక్షుడు సునీల్, చార్మినార్ అధ్యక్షుడు మూల రామ్ చరణ్ దాస్, పాతబస్తీ బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి..**

చాంద్రాయణగుట్ట: బీఆర్.అంబేడ్కర్‌ను సామాజిక మాధ్యమంలో కించపరుస్తున్న ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్ డిమాండ్ చేశారు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జిలానీకి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గాంధీని చంపినట్లుగా అంబేడ్కర్‌ను కూడా చంపేవాడనంటూ సోషల్ మీడియాలో మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### అభినందనలు



ప్రిన్స్ ఆదిల్ నవాబ్‌ను అభినందిస్తున్న ఆమేర్ జావేద్

నాంపల్లి: సుల్తాన్ ఉల్ ఉలూం లా కళాశాల వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు–2023 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై క్రికెట్ చాంపియన్ షిప్ కప్‌ను గెలుపొందిన ప్రిన్స్ ఆదిల్ నవాబ్ అలియాస్ యూసుఫ్ మస్కతిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆమేర్ జావేద్ అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు.

## అలరించిన చిన్నారుల గాత్ర కచేరి




సంగీత గురువులను సన్మానిస్తున్న వేణుగోపాల చారి

గన్‌ఫౌండ్రీ: చిన్నతనం నుంచే పిల్లలకు సంగీత గాత్ర కచేరీలపై మక్కువ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సరిగమప పేరిట పిల్లల సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలతో పాటు వివిధ అంశాలపై చిన్నారుల పాటలు సంగీత ప్రియులను అలరించాయి. ఈ సందర్భంగా పలువురు సంగీత గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుల్లితెర నటులు రాజశ్రీ, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లలితారావు తదితరులు పాల్గొన్నారు.

### మణికొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్ పక్కన శనివారం ప్రారంభమైంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైన ర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యూవలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు అందుబాటులో ఉన్నాయి.

## జాతీయ లోక్ అదాలత్‌లో 78,975 కేసులు పరిష్కారం



రాజీ కుదుర్చుకున్న పార్టీలకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న పాపిరెడ్డి



మాట్లాడుతున్న చీఫ్ జడ్జి రేణుకా యారా

నాంపల్లి: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, భారతీయ సుప్రీంకోర్టు న్యూ ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం నాంపల్లి మనోరంజన్ కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. మెట్రో పాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 31 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు–15, మనోరంజన్ కోర్టు కాంప్లెక్స్–9, సికింద్రాబాదు కోర్టు కాంప్లెక్స్–7 బెంచ్‌లు పనిచేశాయి. రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద కేసులు, గృహహింస కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. జాతీయ లోక్ అదాలత్ ద్వారా 78975 కేసులు పరిష్కారమైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ.. రాజీయే రాజమార్గమని భావించిన ఎన్నో పార్టీలు జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకున్నారని అభినందించారు. రాజీ కుదుర్చుకున్న పార్టీలకు పాపిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కుష, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు డాక్టర్ శబరీష్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాణి, మనోరంజన్ కాంప్లెక్స్ జ్యూడీషియల్ ఆఫీసర్లు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

**బాధితులకు రూ.295,474,502 నష్ట పరిహారం అందజేత..**

యాకుత్‌పురా: జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1222 సివిల్ కేసులు పరిష్కరించి బాధితులకు మొత్తం రూ.295,474,502 ల నష్ట పరిహారం చెల్లించేటట్లు కేసులు రాజీ పద్ధతిలో పరిష్కరించినట్లు చీఫ్ జడ్జి రేణుకా యారా వివరించారు. పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వీటిలో 368 మోటార్ ప్రమాద నష్ట పరిహార క్లైమ్‌లు.. మిగతావి పెండింగ్ సివిల్ కేసులు కాగా... 824 ప్రీ లిటిగేషన్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించామని రేణుకా యారా తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో నాలుగు బెంచీలు, సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో రెండు బెంచీలు, సిటీ స్మాల్ కాజ్ కోర్టులో రెండు బెంచీలు ద్వారా కేసుల పరిష్కారం జరిగినట్లు వివరించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ బెంచ్‌కు చీఫ్ జడ్జి రేణుకా యారా నేతృత్వం వహించగా సిటీ స్మాల్ కాజ్ కోర్టు బెంచ్‌కు స్మాల్ కాజ్ కోర్టు చీఫ్ జడ్జి నిర్మల గీతాంబ, సికింద్రాబాద్ కోర్టు బెంచ్‌కు మొదటి అదనపు చీఫ్ జడ్జి మంజరి నేతృత్వం వహించారని. సిటీ సివిల్ కోర్టులోనూ ఇతర లోక్ అదాలత్ బెంచ్‌లకు అదనపు చీఫ్ జడ్జిలు ఎస్.శ్రీనివాసరెడ్డి, ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జి జలీల్, జూనియర్ సివిల్ జడ్జి సాధనలు నేతృత్వం వహించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీ మోహన్ వివరించారు.

## ప్రజా సేవలోనే సంతృప్తి: ఎమ్మెల్యే కౌసర్



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సేవలోనే సంతృప్తి పొందుతున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఉదయం కార్వాన్, జియాగూడ, టోలిచౌకి డివిజన్ల నుంచి పలువురు ఆయనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కూడా తాను ప్రజా సమస్యలు వినడానికి ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. అసెంబ్లీ విరామ సమయంలో తనకు వచ్చిన ఫిర్యాదుల గురించి సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరింపజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా కార్వాన్ నియోజకవర్గ మజ్లిస్ కార్పొరేటర్లు, మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధుల ద్వారా వారి వారి ప్రాంతాల సమస్యలను వింటున్నానని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రశ్నలులేవనెత్తానన్నారు. తాను లేవనెత్తిన సమస్యలపై రాష్ట్ర మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఆయ శాఖల మంత్రులను అసెంబ్లీ సాక్షిగా అడిగిన ప్రశ్నల విషయంపై వారికి గుర్తుచేసి నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీమొద్దీన్, జబ్బార్ తదితరులు ఉన్నారు.

### బండి సంజయ్‌కి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేసిన శంకర్ తదితరులు

జియాగూడ: ఈ నెల 19న జియాగూడలో జరిగే ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభా యాత్రకు హాజరు కావాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని ఆహ్వానించినట్లు ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాదళ్ అధ్యక్షుడు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్ తెలిపారు. ఈ మేరకు శనివారం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్‌ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 11 గంటలకు జియాగూడ కేసరి హనుమాన్ ఆలయ ప్రాంగణం నుంచి ఛత్రపతి శివాజీ మహరాజ్ మహా శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కేసరి హనుమాన్ ఆలయం, భగత్‌సింగ్ చౌరస్తా గోపీ హోటల్ వద్ద బహిరంగ సభలు ఉంటాయన్నారు. స్వాగత వేదికలపై విద్యార్థులతో మల్కం, భరతనాట్యం, కర్రసాము, భారతమాత, గోమాత విగ్రహాలు, ఛత్రపతి శివాజీ మహరాజ్ భారీ విగ్రహం, రాజుల వేషధారణలు, భారతమాత తదితర వేషధారణలు ఉంటాయని తెలిపారు.

## ఉత్సాహంగా వీనస్ హైస్కూల్ క్రీడోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయ కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్

గోల్కొండ: టీనేజీ అమ్మాయిలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై విశేషంగా రాణిస్తున్నారని కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్ అన్నారు. శనివారం టోలిచౌకి వీనస్ హైస్కూల్ వార్షిక క్రీడోత్సవాలు పర్వాద్–2022, 23 ఫాతిమా గ్రౌండ్‌లో జరిగాయి. ఆమె ప్రత్యేక అతిథిగా హాజరై వివిధ క్రీడా పోటీల్లోని విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. అమ్మాయిలు ఇష్టపడే క్రీడాంశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షకులచే శిక్షణ తీసుకున్నామని వీనస్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ మహ్మద్ హిదాయత్‌అలీఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్, సఖినా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్, అల్తాఫ్ హుస్సేన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ మీర్ జవార్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

## ఉత్కంఠ భరితంగా మల్లయుద్ధం పోటీలు



పోటీల్లో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: ముఖేష్‌గౌడ్ మెమోరియల్ మల్లయుద్ధ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠ భరితంగా ఎల్బీ స్టేడియంలో కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం సెమీ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. అదేవిధంగా కుస్తీ పోటీల్లో రాణిస్తున్న అమ్మాయిలను అభినందించారు. ఈనెల 12న ఫైనల్ పోటీలు జరుగుతాయని శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్‌గౌడ్ తెలిపారు.

## 'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'



మాట్లాడుతున్న బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్ సింగ్

గోల్కొండ: బీజేపీ తెలంగాణలో పటిష్ఠంగా ఉందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్ సింగ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస, బీజేపీ భరోసా స్టేట్ కార్నర్ సమావేశం శనివారం కార్వాన్ డివిజన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకం పూర్తిగా పోయిందన్నారు. తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముసుగులో ప్రజా దోపిడికి కొత్త పథక రచన చేస్తున్న కేసీఆర్‌కు ప్రజలు గుణపాఠం నేర్పుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు వనం ప్రకాశ్, నాయకులు ఆకుల గోవర్ధన్, ఇంద్రసేన్‌రెడ్డి, శివరత్నం, దొర్తుల శ్రీనివాస్ తదితరులున్నారు.

### టైర్ల దుకాణంలో అగ్నిప్రమాదం



కాలిపోతున్న టైర్లు

డబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారుషిఫా ప్రాంతంలో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. దారుషిఫాలోని పాత టైర్ల దుకాణం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శనివారం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలి మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న టైర్ల దుకాణానికి మంటలు వ్యాపించడంతో టైర్లు మొత్తం కాలిపోయాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గత వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీక్ అవుతుందని.. ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చినా.. పట్టించుకోలేదని ఫలితంగా అగ్ని ప్రమాదం జరిగిందని.. తాను రోడ్డున పడ్డానని టైర్ల వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



రాజేంద్రనగర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. డివిజన్ పరిధిలోని హనుమాన్ కాలనీ రతన్‌నగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బస్తీ వాసులు సీసీ రోడ్డు కంటే ముందు నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉందని పాత పైపులైన్ చిన్నదిగా ఉండడంతో బస్తీలలో నుంచి తిరిగి వచ్చే సరికి మా వీధిలో ప్రెజర్ పూర్తిగా తగ్గిపోతుందని ఆమెకు వివరించారు. దీంతో ఆమె స్పందించి అధికారులతో చర్చించి సీసీ రోడ్డు పనులను నిలిపి వేయించి మొదట మంచినీటి పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆమె పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడే నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రానున్న ఎండా కాలంలో సమస్య మరింత తీవ్రత కానుందన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచినీటి పైపులైన్ పనులను చేపడుతున్నామన్నారు. ఈ పనులు పూర్తైన వెంటనే సీసీ రోడ్డు పనులను సైతం ప్రారంభించి కొత్త రోడ్డును వేస్తామన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు.